**కథ**

# వివేకం

**గుంటూరు లక్ష్మీకామేశ్వరి**

**సరళ మేడమీద గదిలో కూర్చుని కిటికీలోంచి చూస్తోంది. వాన కొద్దిగా తగ్గింది కానీ ఆకాశంలో దట్టంగా మబ్బులు కమ్ముకుని ఉన్నాయి. సన్నగా జల్లు పడుతోంది. ఆ జల్లుకు తడుస్తూ పండ్లు, కూరగాయలు అమ్మేవాళ్ళు తిరుగుతున్నారు. ఏం చేస్తారు పాపం. అమ్మక తప్పదు. పూట గడవని వాళ్ళు, కాలు, చెయ్యి కదిలిస్తేనే కడుపు నిండుతుంది. సరళ వాళ్ళని తలుస్తూ ఏదో ఆలోచనలో వుండిపోయింది.**

"ఏమమ్మా సరళాదేవి, ఏం చేస్తున్నావ్?" సున్నితంగా నవ్వుతూ వచ్చి కూర్చుంది వదిన శారద.

"ఏం లేదు బడుగుజీవుల బ్రతుకుల గురించి ఆలోచిస్తున్నాను" ముక్తసరిగా సమాధానం చెప్పింది.

"అవునూ! మీ అన్నయ్య చెప్పారు ఉద్యోగం చేస్తావటగా"

"అవునొదినా చేయాలనే అనుకుంటున్నాను. చదువుకున్నాను కదా! దాన్ని వృధా చేయటం ఎందుకు" అంది సరళ.

"బాగుందమ్మా ఆడబిడ్డా, నీ వరుసా!" ప్రతి మాట హాస్యధోరణిలోకి దింపటం శారదకు అలవాటు. "దేన్ని వృధా చేస్తున్నాననుకుంటున్నావు.. చదువునా ఏమిటి? విద్య నిగూఢమగు విత్తమన్నాడు సుభాషితకారుడు. అది వృధా అవ్వటం ఎక్కడన్నా ఉంటుందా! చదువు ఉద్యోగం చెయ్యకపోతే వృధా అయిపోతే నా మాటేమిటి? నేనూ చదువుకున్నాను. ఆ విజ్ఞానాన్ని నా పిల్లలకు అందిస్తున్నాను. అంతేకాదు. మనకు భగవంతుడు సిరిసంపదలిచ్చాడు. మనం ఊరుకుంటే ఆ ఉద్యోగం ఏమీ లేని వాళ్ళకు వస్తుంది. వాళ్ళు జీవితంలో నిలబడతారు. మనం అలాంటి వాళ్ళకు అవకాశం ఇవ్వాలి" శారద తన మాటలు ఆడబడుచు మీద ఎంతవరకు పని చేస్తున్నాయోనని గమనించింది.

సరళ, వదిన చెప్పిన దాంట్లో నిజం లేకపోలేదని, అది కూడా ఆలోచించాల్సిన విషయమేకాని, తనకు పెళ్ళి జరగటం లేదు. ఎన్నో సంబంధాలు వచ్చాయి. నాకు నచ్చితే వాళ్ళకు నచ్చకపోవటం, వాళ్ళకు నచ్చితే నాకు నచ్చకపోవడం ఇలా ఎన్నాళ్ళు? ఊరికే పుట్టింట్లో కూర్చుని తినడం నచ్చలేదు తనకు. అందుకే ఉద్యోగ ప్రయత్నం.

"అన్నట్లు, సరళా నీకసలు విషయం చెప్పటం మర్చిపోయాను. సాయంత్రం నిన్ను చూడటానికి పెళ్ళివారొస్తున్నారు. ఈ సంగతి మీ అన్నయ్య నీతో చెప్పమన్నారు" అంది శారద.

'మళ్ళీ పెళ్ళిచూపుల తతంగం అన్నమాట. ఈసారి ఏమవుతుందో...' అనుకుంటూ నీరసంగా అంది వదినతో "అన్నయ్య నా పోలికే. మరి నువ్వు అన్నయ్యని చేసుకున్నావు కదా! మరి, నన్ను ఎవరూ చేసుకోరేం"

"మగవారిలో చూసేది అందచందాలు కాదమ్మా. సంపాదనాపరుడు అవునా, కాదా అని. అదే ఆడవారిలో అయితే అందచందాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు" అని చెప్పి "నాకు అవతల చాలా పనులున్నాయి" అంటూ వెళ్ళిపోయింది శారద.

సరళ తల్లిదండ్రులు లేని పిల్ల. అన్నావదినలే తల్లిదండ్రుల్లా చూస్తూ ఆమెకు ఏ లోటూ రానివ్వలేదు. సరళ ఒక మాదిరి నలుపు. అనాకారి అని ఖచ్చితంగా చెప్పటానికి వీల్లేని మాట నిజమేకానీ అందమైనది అనటం మాత్రం సమంజసం కాదు. నలుపుమాట అటుంచి ఆకర్షణగాని, కళగాని ఆ ముఖంలో లేవు. తన ముక్కు తీరు తీర్చినట్టు వుండదు. డబ్బుతో అన్నీ కొనలేము. డబ్బుతో మనం కొనగల వస్తువు నిజానికా డబ్బు విలువలో సగమే ఖరీదు వుంటుంది.

సాయంత్రం అవుతోంది. వాళ్ళు వచ్చేవేళ కూడా దగ్గర పడింది. సరళ త్వర త్వరగా ముస్తాబు ముగించుకుని క్రిందికి వెళ్ళింది. హాలు బ్రహ్మాండంగా అలంకరించారు అన్నయ్య పిల్లలు. 'ఇది పదిహేడోసారి అయివుంటుంది' అనుకుంది సరళ.

శారద ఆడబడుచును చూసి సంతృప్తిగా నవ్వింది. సరళకి చాలా చిన్నతనంలోనే ఆమె కాపురానికి వచ్చింది. సరళను తన పిల్లలలో ఒకతెగా చూసుకుంటుంది. ఆమె కళ్ళకు సరళ రంభలా కనబడిందంటే ఆ దోషం శారదది ఎలా అవుతుంది. తప్పు ఎన్నవలసి వస్తే ఆడబిడ్డని కన్న కూతురుగా చూసుకోగల్గిన ఆమె హృదయౌన్నత్యానిది.

'ఇంతకీ వచ్చేదెవరో' నేలమీద వేలితో గీతలు గీస్తూ తల వంచుకుని తనలో తననుకున్నట్లుగా అంది సరళ.

"అదేమోనమ్మా! మీ అన్నయ్య నాకేమన్నా చెప్పారా ఏమన్నానా? ఆఫీస్ నుంచి ఫోన్ చేసి వాళ్ళని నాలుగింటికి తీసుకొస్తానన్నారు" అంది శారద.

'నాలుగు దాటింది. ఇంకా వాళ్ళు రాలేదేమిటబ్బా' అని సరళ అనుకుంటుండగానే బయట ఆటో ఆగిన శబ్దం అయింది.

సరళ వాళ్ళన్నయ్య రఘు పెళ్ళివారిని వెంట పెట్టుకుని లోపలికొచ్చాడు. వాళ్ళు ఎక్కువమంది లేరు. పెళ్ళికొడుకు, అతని తల్లిదండ్రులు, ఒక మధ్యవర్తి వచ్చారు. పెళ్ళిచూపులు అయ్యాయి. పెళ్ళికొడుకు, తల్లి, తండ్రి ముఖాలు చూసుకున్నారు.

"మాకు పిల్ల నచ్చింది. ఇక మీ అభిప్రాయం చెప్పండి" పిల్లవాడి తండ్రి స్పష్టంగా చెప్పేశాడు.

"చాలా సంతోషం" అన్నాడు సరళ అన్నయ్య.

"మరి మీ అభిప్రాయం" తిరిగి ప్రశ్నించారు వాళ్ళు.

"అమ్మాయి మరీ చిన్నదేం కాదుగా. దాని అభిప్రాయం కనుక్కోవాలా? మేం కబురు పంపుతాంలెండి. మనదేముంది. పిల్లలిద్దరికీ నచ్చటం కదా కావాలి" రఘు మృదువుగా చెప్పాడు.

సగౌరవంగా పెళ్ళివారిని సాగనంపి వెనక్కి తిరిగాడు.

మేడమీద నుండి సరళ వారివంకే చూస్తోంది. బహుశా పెళ్ళికొడుకు మేడమీద నుంచి తనను చూసిన మధుర వీక్షణాలను ఊహించి ఉండడు.

వాన పూర్తిగా తగ్గింది. గాలి చల్లగా వీస్తోంది. విరగబూసిన మాధవీలత తన గొప్పతనాన్ని లోకానికి చాటుతోంది. ఆకాశంలో స్పష్టాస్పష్టంగా ఇంద్రధనుస్సు కనబడుతోంది. ఈ చల్లని సమయంలో మేఘాలను చూసి పరవశించి వన మయూరాలు మత్తెక్కి నాట్యం చేస్తూంటాయి.


అతనెవరో! ఏం చదివాడో, ఏం చేస్తున్నాడో తనకు కాబోయే భర్తను గురించి తెలుసుకోవాలనే ఉబలాటం సహజమైంది కదా!

రఘు వారిని సాగనంపి లోపలికి వచ్చి చాలాసేపైంది. 'ఇప్పటికి సమాచారమంతా వదిన సేకరించే వుంటుంది' అనుకుంటూ సరళ మెల్లగా మెట్లు దిగుతోంది. అన్న వదినెల మాటలు వినిపిస్తున్నాయి.

"మరైతే ఈ పెళ్ళిచూపులెందుకొప్పుకున్నారు" అంటోంది వదిన.

"నాకు వివరాలు మొదట తెలియవు. మంచి సంబంధం అంటూ మధ్యవర్తి చెప్పాడు. తీరా చూస్తే ఇదీ!" అని అన్నయ్య అంటున్నాడు.

"వాళ్ళు మంచివాళ్ళే. ఉన్నది ఉన్నట్లు కుండ పగలగొట్టారు. మాకది ఉందీ, ఇది వుందీ అని అబద్ధాలు ఎందరు చెప్పడం లేదు" వాళ్ళ మంచితనాన్ని సమర్థించింది శారద.



"వాళ్ళ మంచితనం మనం కాదనలేదుగా, ఎంత మంచైతే మాత్రం చూస్తూ చూస్తూ అలాంటి చోట పిల్లనెలా పడవేస్తాం. మన మంత గతిలేని వాళ్ళమా ఏమన్నానా?" అన్నాడు రఘు.

"బాగానే వుంది" శారద బరువుగా నిట్టూర్చింది.

"ఇప్పుడేమయిందని, ఆ నిట్టూర్పు"

"చూడండి శ్రీవారూ! మన అంతస్తుకి తగిన సంబంధాలెన్నో చూశాం కదా! అందం, ఐశ్వర్యం, చదువు, హోదా అన్నీ వున్నవాడికి మన పిల్ల నచ్చవద్దా! అలా అని సరళ బాగోలేదని నేననటం లేదండోయ్. ఎలాగైనా పిల్ల చాయ తక్కువ కదా! ఆ రంగు మూలంగా పిల్ల తేటగా కనబడటం లేదు. కాస్త ఇది కూడా మనం ఆలోచించాలి" అంది శారద.

ఆ క్షణంలో సరళకు వదిన దేవతలా అనిపించింది. వదిన మాటకారే కాదు, ఆలోచనాపరురాలు కూడా.

"నువ్వింక ఊరుకో. కష్టపడి తిరిగేది, వివాహం చేసేది నేను. తెచ్చే జీతం తప్ప ఆధారం లేదాయె. ఎంత లెక్చరర్ అయితే మాత్రం తల్లీ, తండ్రీ, తమ్ముడూ, చెల్లెలూ ఇంతమంది బాధ్యత అతని మీదే వుంది. ఇక అమ్మాయేం సుఖపడుతుంది. నీ పద్ధతి చూస్తే అది ఇంట్లో ఉండటం నీకిష్టం లేదులాగుందే!" రఘు కటువైన మాటలు శారద గుండెను చీల్చటమే కాదు, సరళ ఆశాధునిని పీల్చివేశాయి కూడా. గిరుక్కున వెనక్కి తిరిగి మేడ మీదకు పరుగెత్తింది సరళ. గుండె పగిలేలా వెక్కి వెక్కి ఏడుస్తున్నా ఎక్కువైన దుఃఖభారాన్ని తీర్చుకోలేకపోయింది.

* * *

"సరళా! చీకట్లో పడుకున్నావేమిటమ్మా! అన్నం తిందువుగాని రా!" అని శారద లైటు వేసింది.

సరళ ముఖం చూసి ఆమె నిర్ఘాంతపోయింది. కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా వెలుగుతున్నాయి.

ముఖం వాచి వుంది. ఇంకా వెక్కిళ్ళు వస్తూనే ఉన్నాయి. "సరళా ఏమయింది, ఏమయిందమ్మా!" చాలా ఆదుర్దాగా సరళను తన అక్కున చేర్చుకుంది. సరళ ఆపుకుంటున్నా దుఃఖం కట్టలు తెంచుకుంది. దానితో శారద మరింత గాబరా పడిపోయింది. ఎప్పుడూ నవ్వుతూ తిరిగే పిల్లకు ఏమయింది?

'మాయదారి సంబంధం. ఎవరు దిష్టి పెట్టారో! ఈ ఏడుపేమిటి!' శారద దిష్టి తీయటానికి లేవబోయింది.

"వదినా!" నీరసంగా నిస్సహాయంగా పిలిచింది సరళ. ఆమెకు కన్నీళ్ళు ఆగటం లేదు.

"నాకేం దిష్టిలేదు"

"మరేమిటి ఎందుకేడుస్తున్నావు? చెప్పు. ఇంత ఏడుపేమిటి, నీకేం కష్టమొచ్చింది?" శారద ఆతృత అణగలేదు. సరళ కన్నీళ్ళు తుడుచుకుని మంచం మీద కూర్చుంది. ఒక్క క్షణం ఊరుకుంది.

"వదినా నేనొకటి చెబుతాను. నెమ్మదిగా విను" ప్రార్థనా పూర్వకమైన ఈ సంభాషణ దేనికి ఉపోద్ఘాతమో తెలుసుకునే నేర్పు శారదకు లేదు. కానీ వినగల ఓర్పు మాత్రం వుంది.

"చెప్పు తల్లీ నీకేం జంకు వద్దు"

"ఆడది సుఖపడటానికి భర్త గుణవంతుడు కావటం ముఖ్యం కదా వదినా! మనకింత డబ్బుంది, కానీ మా అన్నయ్య మంచివాడు కాకపోతే నీకు సుఖముండేదా! మీరు వేలకి వేలు కట్నం ఇవ్వగలరు. అందుకే మనకంటే ఉన్నవాళ్ళకు నేను కోడల్ని కావాలని కోరుతున్నారు. నా సుఖం మీరు కోరుతున్నారు. కాదనను. కానీ నేను అందగత్తెను కాను. మీరు అందలం ఎక్కించాలన్నా నాకా అదృష్టం లేదు. వాళ్ళు తమ కుటుంబ పరిస్థితులను విడమరచి చెప్పారు. అతను యోగ్యుడని మీరే ఒప్పుకుంటున్నారు.."

సరళ మాటలలోని అర్థం కొంచెం కొంచెం శారదకి తెలుస్తోంది. తన ఆడబడుచు, తన చేతిలో పెరిగిన పిల్ల ఇట్లా మాట్లాడటం ఆమెను ఆశ్చర్యంలో ముంచింది. భోజనానికి పిలిచిన భార్య ఎంత సేపటికీ రాలేదని మేడమీదకు వచ్చిన రఘు గుమ్మానికి ఆనుకుని అట్లాగే నిలుచుండిపోయాడు.

ఒక్కగానొక్క చెల్లెల్ని స్వర్గంలాంటి ఇంట్లో పడవేయాలనుకున్నాడు. ఆస్తి, అంతస్తు ఇదే అతని ఆలోచనలోని స్వర్గం. కానీ చెల్లెలి ఆలోచన వేరుగా వుంది. ఇన్నాళ్ళ తన అంచనా తప్పన్న మాట. చిన్నదైనా ఆమెలో వున్న ఆత్మవిమర్శ తనలో లేకపోయింది.

"నాకు కట్నం ముఖ్యం కాదు. గుణవంతురాలై నాతో పాటు ఉద్యోగం చేసి కుటుంబాన్ని ఆదుకునే పిల్ల కావాలి. నాకు కట్నం కూడా వద్దు" అన్నాడు పెళ్ళికొడుకు. అట్లాంటివాడిని కాదనటం తప్పేమరి.

"అయితే ఈ సంబంధం ఖాయం చేయమంటావా అమ్మా!" మెల్లిగా అడిగాడు రఘు.

అన్నను చూసి కంగారుపడి తలదించుకుంది సరళ. "అందని పళ్ళకోసం ఆశపడితే లాభం ఏముందన్నయ్యా!" అంది మెల్లిగా.